క్లుప్తంగా

ఉండవెల్లి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి నూతన తహసీల్దార్‌గా వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం అయిజ మండలంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై వచ్చి తహసీల్దార్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీ నిర్మించాలని వినతి

రాజోళి: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ నగర్ కాలనీలో క్యాషియర్ ప్లాట్లల్లో డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్‌కు వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జెన్‌కో విద్యార్థుల ఎంపిక

ధరూరు: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలలో ఒవెరాల్ ఛాంపియన్ షిప్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు జెన్‌కో విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 23న గద్వాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలలో విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో అక్షయ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. 400 మీటర్లలో రెండో స్థానంలో అశోక్‌లు నిలిచారు. 200 మీటర్స్, జావలిన్‌త్రోలో శ్రీహర్షలతో పాటు వివిధ పరుగు పందెం పోటీల్లో అఖిల్, వినూత్న, ప్రహర్ష, వైష్ణవి, లావణ్య, మధుమతి, అనూషలు ఎంపికైనట్లు వారు తెలిపారు. విద్యార్థులను జెన్‌కో రామసుబ్బారెడ్డి అభినందించారు.

తహసీల్దార్‌ను కలిసిన వరద బాధితులు

మానవపాడు: 2009లో వచ్చిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన మద్దూరు గ్రామ వరద బాధితులు ఎంపీపీ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌ను కలిశారు. ఈ మధ్య కాలంలో అదనపు కలెక్టర్ గ్రామంలో పర్యటించి స్థలాల విషయమై చర్చించారని తెలిపారు. గ్రామస్తుల రేషన్, ఆధార్ సంబంధిత వివరాలు సేకరిస్తుండగా, కొందరు గ్రామ పంచాయతీ సిబ్బంది రూ.5000 వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, అధికారుల ఆదేశాల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అయిజ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మేడికొండకు చెందిన బోయ రాముడు సోమవారం బైక్‌పై అయిజకు వస్తుండగా ఆటో ఢీకొని కాలుకి గాయమైంది. అతన్ని 108 వాహనంలో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీకొని..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన దేవదానం పని నిమిత్తం తన బైక్‌పై ఎర్రవల్లికి వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొండేరు స్టేజీ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవదానానికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సలోమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

శాంతినగర్: రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం కావడంతో కేసు నమోదైన ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. శాంతినగర్ ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన వెల్డింగ్ నాగరాజు (42) గత శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి బయటికి వెళ్లివస్తానని భార్య చుక్క భాగ్యలక్ష్మికి చెప్పి వెళ్లాడు. ఆరోజు నుంచి మూడు రోజుల పాటు ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య సోమవారం శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజుకు కొడుకు, కూతురు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న జరగాల్సిన సమావేశం సరైన కోరం లేక వాయిదా పడినట్లు తెలిపారు. ఐకేపీ భవనంలో బుధవారం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖ అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

భజన వాయిద్యాలు వితరణ

అయిజ: పట్టణంలోని గుంతరామ లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్నేహ టిఫిన్ సెంటర్ యజమాని అంజి భజన సామగ్రి తబల, మద్దెల, తాళాలు తదిర వస్తువులను ఆలయ కమిటీ వారికి వితరణ చేశారు.

కృష్ణానదిలో నిమజ్జనం



ట్రాక్టర్‌లో బీచుపల్లికి చేరుకుంటున్న గణనాథుడు



యాపదిన్నెలో పూజలు చేస్తున్న భక్తులు



నీటిలో మునుగుతున్న గణపయ్య

ఎర్రవల్లిచౌరస్తా: గణేష్ ఉత్సవాల్లో భాగంగా బీచుపల్లి కృష్ణానదిలో సోమవారం గణనాథుల నిమజ్జనం కొనసాగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి గణనాథులను శోభాయాత్రగా బీచుపల్లి కృష్ణానది పుష్కరఘాట్‌కు భక్తులు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంతో గణనాథులను కృష్ణమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. కృష్ణానది పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూఅధికారులు బందోబస్తు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో వినాయకుడికి భక్తులు పూజలు నిర్వహించారు. యాపదిన్నెలో చెన్న కేశవ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణేష్ మండపం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అలంపూర్‌రూరల్: మండల కేంద్రంలో క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటలతో సందడి చేశారు.

గద్వాల: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జిల్లా కేంద్రంలోని పలు గణేష్ మండపాలలో వేరువేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాలలోని వినాయకులను దర్శించుకున్నారు. లింగంబావి దగ్గర ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఎంపికలు



నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గద్వాల: శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారిణి ఎస్తేర్‌రాణి సూచించారు. సోమవారం స్థానిక బాలభవన్‌లో సైన్స్ డ్రామా ఫెస్టివల్ కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పది పాఠశాలల నుంచి 22 విభాగాలలో ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో ఐదు అంశాలలో విద్యార్థులు నాటికలు ప్రదర్శనలు ఉన్నాయి. అయిజ బ్రైట్ స్టార్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చిరుధాన్యాలపై చేసిన ప్రదర్శన మొదటి స్థానంలో నిలిచింది. గద్వాల ప్రగతి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు మూఢ నమ్మకాలపై ప్రదర్శించబడిన నాటికలు ద్వితీయ స్థానాలలో నిలిచింది. అదే అంశంతో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన నాటిక మూడో స్థానంలో నిలిచింది. అక్షర కాన్సెప్ట్ స్కూల్, అలంపూర్ టీఆర్‌డబ్ల్యూస్‌కు చెందిన విద్యార్థులు బాల్య వివాహాలు, ఇతర దురాచారాలపై నాటికలు ప్రదర్శించి మెప్పు పొందారు. సమన్వయ కర్తలుగా విజయలక్ష్మి, న్యాయ నిర్ణేతలుగా జ్యోతి, విజయశ్రీ ఉన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు న్యాయమైనవే..



రాజోళిలో మాట్లాడుతున్న తిప్పన్న



అలంపూర్‌లో నిరవధిక సమ్మెలో ఆశా వర్కర్లు

రాజోళి: ఆశా వర్కర్లు అడుగుతున్న డిమాండ్లు న్యాయమైనవేనని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న అన్నారు. మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు చేస్తున్న సమ్మెలో సోమవారం వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు విజయ్ కుమార్, పంచాయతీ సిబ్బంది లక్ష్మన్న ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

గద్వాల అర్బన్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సునీత, పద్మ, నాగ ప్రమీల, శ్వేత, జయమ్మ, లక్ష్మి, రేణుక ఉన్నారు.

అలంపూర్: ఆశావర్కర్ల వేతనాలు అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ విమర్శించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు నాగేశ్వరమ్మ, పద్మావతి, చంద్రకళ, బీసమ్మ, రేణుక ఉన్నారు.

అయిజ: తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ దుర్గాసింగ్‌కి వినతిపత్రం అందజేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో ఆశాలు సరస్వతి, రాజేశ్వరి, సుగుణ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



గట్టు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

గట్టు: రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా కార్యదర్శి మాచర్ల ప్రకాష్, బల్గెర సునంద్‌లు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ధరణి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. మండలంలో అధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని, రైతుల సమస్యలు, సామాన్యుల సమస్యల పరిష్కరించే విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సూచించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయమ్మ

మల్దకల్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుర్వేదిక్ డాక్టర్ జయమ్మ సూచించారు. సోమవారం మండలంలోని పెద్దొడ్డి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేశ్వరి, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రూప్–1 రద్దు



మాట్లాడుతున్న హరీష్

శాంతినగర్: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దయిందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ పీడీఎస్‌యూ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం వల్ల కోర్టు రద్దు చేయడంతో నిరుద్యోగులు తీవ్ర మానసిక వేదనకు గురువుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇకపై పరీక్షల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పటిష్ట చర్యలు తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో జమ్మిచేడు కార్తీక్, శ్రీనివాసులు, తిమ్మప్ప, భీమేష్, తిరుమలేష్‌లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ పద్మమ్మ ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. గర్భిణీలు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, పద్మమ్మ, తిమ్మమ్మ పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

అలంపూర్‌రూరల్: మండలంలోని ఇమామ్‌పూర్, కాశీపూర్ గ్రామాల్లో సోమవారం వానాకాలం 2023 సీజన్‌లోని సాగు చేసిన పంటలను డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సక్రియనాయక్ పరిశీలించి మాట్లాడారు. పంటల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. మొక్కజొన్న సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ అనిత, శ్రీధర్ ఉన్నారు.

రైతు సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గట్టు: రైతు సంఘాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. సోమవారం చాగదోన రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి సభ్యత్వం తీసుకున్న రైతులకు గుర్తింపు కార్డులను ఎంపీపీ అందజేశారు. సభ్యత్వం తీసుకున్న రైతులకు వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలను రాయితీపై అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీందర్‌గౌడు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలి

గద్వాల అర్బన్: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 15వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటర్మెంట్ బెనిఫిట్స్, అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలని, గ్రాడ్యూటీ ఇవ్వాలని, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమ్మెలో నర్మద, ఫరీదా, అరుణ, జ్యోతి, శిరీష ఉన్నారు.

అందరూ చదువుకునేలా చూడాలి

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలందరు చదువుకునేలా చూడాలని ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండల బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశం శాంతినగర్‌లోని ఐకేపీ భవనంలో సోమవారం నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సామేలు, సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఓపెన్ కేటగిరిలో చేర్చండి

గద్వాల అర్బన్: ఉర్దూ మీడియం పోస్టులను ఓపెన్ కేటగిరిలో చేర్చాలని కోరుతూ సోమవారం పలువురు అభ్యర్థులు అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, డీఈఓ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాకు కేటాయించిన ఎస్జీటీ ఉర్దూ మీడియం 8 పోస్టులను వారికే కేటాయించారన్నారు. ఈ పోస్టులను ఓపెన్ కేటరిగిలోకి చేర్చి అర్హత కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అబు సుఫియాన్, సోఫియా బేగం, అనీస్ ఫాతిమా ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ధరూరు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలతో పాటు సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాత బృందం సభ్యులు తెలిపారు. మండలంలోని ఉప్పేరులో సోమవారం షీ టీం, పోలీసు కళాజాత బృందం, భరోసా టీం సభ్యులు ఎస్‌ఐ శివానందం గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైన వెంటనే బాధితులు 1930 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, షీ టీం, కళా బృందం సభ్యులు హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై..

మల్దకల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామరత్నం గ్రామస్తులకు సూచించారు. సోమవారం మండలంలోని పాల్వాయిలో సర్పంచ్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ జీవన్‌రెడ్డి, గోవిందు, బాష, మనోజ్‌కుమార్, జయంతుడు, మధు, హనుమన్న, దేవదాసు, నర్సింలు, సులోమితమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిజ్వారంలో వడ్డేర కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, సత్యారెడ్డి, రమేష్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

బోరవెల్లిలో పోలింగ్ అబ్జర్వర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్పతీ నాయక్

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్పతీనాయక్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి, అక్కడి సౌకర్యాలు తెలుసుకున్నారు. ఫామ్ 6కు సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంత వరకు కలెక్ట్ చేశారని, ఓటరు జాబితాలో ఎలాంటి సవరణలు చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ జుబేర్ మొయినుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ ధరణి షా, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పాదయాత్ర



అలంపూర్ చౌరస్తా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్

అలంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనకు మరోసారి పాదయాత్ర చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుట్ట విజయ్ మాదిగ తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ పాదయాత్రకు సిద్ధమైనట్లు తెలిపారు. అక్టోబర్ 4వ తేదీ అలంపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నవంబర్ 4వ తేదీన హైదరాబాదుకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా 30 రోజులపాటు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా సమన్వయకర్త మస్తాన్ మాదిగ, జిల్లా కన్వీనర్ రాజేష్ మాదిగ, జాతీయ నాయకులు భీమన్న మాదిగ, నాయకులు ఎలీషా మాదిగ, ఆంజనేయులు మాదిగ, నాగరాజు మాదిగ, ఏసన్న మాదిగ, ఏసేపు మాదిగ ఉన్నారు.

నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న వివేకానంద యూత్ సభ్యులు

అలంపూర్: స్థానికంగా ఉన్న హాస్టల్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు కోరారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద యూత్ సభ్యులు స్థానికంగా ఉన్న ఇంటర్మీయట్ బాలికల, బాలుర హాస్టళ్లను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు వివేకానంద యూత్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర, బాలికల హాస్టళ్లను మరో ప్రాంతానికి తరలించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు సంజీవ నాయుడు, ప్రధాన కార్యదర్శి రజనీబాబు, కార్యదర్శులు ముస్తఫా, కరేందర్, మనోహర్, విజయ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండాలి



గురుకుల పాఠశాలలో విద్యార్థుల నృత్యం

ఉండవెల్లి: కళాశాలలో ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో రాణించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి హృదయరాజు అన్నారు. సోమవారం మండలంలోని పుల్లూరులోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్‌సీఓ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు విద్యాలత, స్వర్ణలత, ధర్మారెడ్డిలు హాజరైనట్లు ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు. డీఐఈఓ హృదయరాజు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చదవాలని, ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఆర్‌సీఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మారుమూల గ్రామాల నుంచి వచ్చి కష్టపడి చదువుకుంటున్నారని, ప్రతి సబ్జెక్ట్‌పై పట్టు సాధించి గొప్ప ప్రయోజకులు కావాలన్నారు.

స్వచ్ఛత వైపు అడుగులు



జోగుళాంబ హాల్ట్ వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న డీపీఎం

ఉండవెల్లి: ప్రతి చోట స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని డీపీఎం రూతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని జోగుళాంబ హాల్ట్ రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖ, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతి, ఏపీఎం మారతమ్మ, పంచాయతీ కార్యాదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో సర్పంచ్ పవిత్ర, ఎంపీటీసీ హారిక భూమి పూజ నిర్వహించారు. సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పాత భవనం వెనుక ఉన్న స్థలంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ స్తులు వెంకట్రాంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, జనార్దన్‌రెడ్డి, గోపాల్, సుధామణి, పద్మ, సువర్ణ, శారద, లక్ష్మీనారాయణ, బాలకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌కు చెందిన ఆటో సవరమ్మ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ పోతురాజు సోమనాద్రి సోమవారం షాబాద్‌కు చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



గద్వాలలో పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పండిట్ దీన్‌దయాళ్ జయంతి బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు.

గద్వాల: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రాపటానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వార్డులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామంజనేయులు, సంజీవయ్య, బండల వెంకట్రాములు, రాములు, రాధాకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్ ఉన్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

ధరూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థునులకు షీ టీంపై అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీ టీం కార్యకలాపాలు, చేసే పనులను వివరించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు దివ్యవాణి, లోకేశ్వరి, హనుమంతులు మాట్లాడారు. 18 ఏళ్ల లోపు బాల బాలికలు పనుల్లో ఉండ కూడదన్నారు. పనులు చేయించుకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.